# తెలుగు భాషకి భవిష్యత్తు వుందా?

1998లో అట్లాంటాలో ప్రథమ అమెరికా తెలుగు సాహిత్య సదస్సు, వంగూరి ఫౌండేషన్ ఆఫ్ అమెరికా ఆధ్వర్యంలో నిర్వహించాం. అప్పుడు అందర్నీ ఒక ప్రశ్న అడిగారు. అమెరికాలోతెలుగు భాషకు భవిష్యత్తు వుందా అని. ఈ ప్రశ్న అడిగింది అమెరికాలో మమ్మల్నే అయినా, అది అటు ఆంధ్రదేశంలోనూ, ఇటు అన్ని దేశాలలోని ప్రవాసాంధ్రులలోనూ, తెలుగువాళ్ళందరికీ వర్తిస్తుంది. ఆరోజు అడిగిన ప్రశ్నకు నాలాటి ఆశావాదులు తప్పకుండా వుంది అంటే, కొంతమంది నిరాశావాదులు "లేదు. భవిష్యత్తు వుండవలసిన అవసరంకూడా లేదు" అని వాళ్ళ అభిప్రాయాలు వాళ్ళు వ్యక్తపరిచారు.

కొన్ని భాషలు చరిత్రలో మాత్రమే మిగిలిపోయినా, చాల భాషలెన్నో సంవత్సరాలుగా బ్రతికే వున్నాయి. కాకపోతే, కాలానుగుణంగా కొంత మేరకు రూపాంతరం చెందాయి. అసలు భాష అన్నది, ఆ ప్రాంత సంస్కృతి మీద ఆధార పడివుంటుంది. అందుకనే సాంస్కృతికపరంగా ఒక భాషలోవున్న మాటలు, ఇంకొక భాషలోవుండవు. ఉదాహరణకి మనకే స్వంతమైన గొబ్బెమ్మలు, హారతి, పాలకోవా లాటి మాటలు ఇంగ్లీష్‌లో కానీ, ఫ్రెంచ్‌లో కానీ లేవు. ఒక సంస్కృతి బ్రతికేవున్నప్పుడు, ఆ సంస్కృతిలో మాట్లాడే భాషకూడా రూపాంతరం చెందినా బ్రతికే వుంటుందని తెలుస్తున్నది. కొన్ని సంస్కృతులు దగ్గరయినప్పుడు మాటలు ఒక భాషలోనించి ఇంకో భాషలోకి రావటంకూడా మనం చూస్తున్నాం. రోడ్డు, పోలీసు, రైల్వే స్టేషన్, బస్సులాటివి, మనం ఇంగ్లీష్‌లోనించి వాడుక తెలుగులోకి తెచ్చుకున్నాం. అలాగే తమిళ్‌నించి ఇంగ్లీష్‌లోకి కాష్ (కాసు) మ్యాంగో (మాంగా), తెలుగునించి ఇంగ్లీష్‌లోకి బాండికూట్ (పందికొక్కు) వచ్చినట్టు మనం చదువుకున్నాం. కనుక భాష దేశ కాల సంస్కృతులపరంగా మారుతూ వుంటుంది. ఇక్కడ నేను ప్రాంతీయ యాసల గురించి మాట్లాడటం లేదు అది వేరే విషయం.

ఇండియాలో ఎక్కువమంది మాట్లాడే భాషల్లో తెలుగు రెండవది. ఇండియా బయట మాట్లాడే భారతీయ భాషల్లో తెలుగు నాలుగో స్థానంలోవుంది. మొదటి నాలుగు భాషలూ హిందీ, బెంగాలీ, తమిళ్, తెలుగు. (బెంగాలీలు ఆ స్థానంలో వుండటానికి ముఖ్య కారణం, బంగ్లాదేశ్‌లో ఎక్కువమంది ప్రజలు బెంగాలీ లో మాట్లాడటమేనను కుంటాను). హైదరాబాద్ తెలుగులో ఎక్కువగా ఉర్దూ కలిస్తే మద్రాసు కోయంబత్తూర్ల తెలుగులో తమిళ్ కలుస్తుంది. కోయంబత్తూర్‌నించి వచ్చిన మా స్నేహితుడు, మేము తెలుగువాళ్ళందానే అని గర్వంగా తమిళ్ కలిసిన తెలుగులో చెబుతాడు.

ఇక్కడ గమ్మత్తేమిటంటే తెలుగుకి తెలుగుదేశంలో ఎంత భవిష్యత్తుందో ప్రవాసాంధ్ర ప్రదేశాల్లో కనీసం అంతకన్నా తక్కువ లేదని నా అభిప్రాయం. మన రాజధానిలోనే చాలమంది తెలుగువాళ్ళు తెలుగువాళ్ళతో హిందీలోనో ఇంగ్లీష్‌లోనో లేక

హిందీ, ఉర్దూ ఎక్కువగా కలిపిన తెలుగులోనే మాట్లాడతారు. మనం ఒక భాషలో మాట్లాడేటప్పుడు వేరే భాషాపదాలు వాడటం సహజమే. అది తప్పని నేననటంలేదు. కానీ నా అభ్యంతరం ఏమిటంటే మాకు తెలుగురాదని గర్వంగా హిందీలో చెప్పే అసలు సిసలైన తెలుగువాళ్ళని కలిసినప్పుడు.

మూడు నెలల క్రితం అనుకుంటాను, ఇంటర్‌నెట్ ఆంధ్రభూమి దినపత్రికలో వల్లూరి సుబ్రహ్మణ్యశర్మగారి వ్యాసం చదివాను. ఆయన ఈనాటి పాఠ్య పుస్తకాల్లోని తెలుగు ఎంత అధోగతిలో వుందో వ్రాశారు. చిన్నప్పుడు నేర్చుకున్న తెలుగులో అ: అమ్మ, ఆ: ఆవు, ఇ: ఇల్లు, ఈ: ఈగ అని చక్కటి తెలుగుపదాలలో తెలుగు నేర్చుకున్నాం. ఇప్పుడు తెలుగు పాఠ్య పుస్తకాలలోనించి ఆయన ఇచ్చిన ఉదాహరణలు చూస్తూంటే, తెలుగుకి భవిష్యత్తేకాదు మన ప్రభుత్వంవారి పుణ్యమా అని వర్తమానం కూడా అనుమానాస్పదంగానేవుంది అనిపిస్తుంది. అ: లవంగం ఆ: టాటా ఇ: హిడింబి, ఈ: రీటా, ఉ: తుపాకి, ఊ:రావూరు, ఋ:? ఎ: సాహెబు, ఏ: డానియేలు, ఐ: బైబిలు ఒ: రొంప, ఓ: మావో, ఔ: టౌను. ఓ పుణ్యభూమీ! కళ్ళుతెరు!

ఈనాటి తెలుగు సినిమా మాటల్లోని, పాటల్లోని తెలుగు వింటుంటే గుండె తరుక్కుపోతుంది. అవి వ్రాసేవాళ్ళు ఏ రోడ్ల మీదనించి వచ్చారా అని అనుమానం వస్తుంది. కొంతమంది హీరోలకు ఒత్తులు పలకవు. బాద అనుబూతి అంటాడు. ఇంకొకతనికి స శ అనే అక్షరాలు పలకవు. షాంత, షమష్య, షివ, ఆష్చయం అంటాడు ఇక పాటల సంగతి సరేసరి. ఒకరోఇద్దరో తప్ప మిగతా రచయితలలో చాలమంది తెలుగు భాషని పాతాళలోకానికి తీసుకు వెళ్ళటానికి యధాశక్తి పాటుపడుతూనే వున్నారు. పొరపాటున పాటల రచయిత చక్కగానే వ్రాసినా, ఆ తెలుగుపాటలు పాడే హిందీ తమిళ్ గాయకులు అక్షరాలు పలకటం చేతకాక వాటిని ఖూనీచేసి, దుర్గంధ భూయిష్టం చేస్తున్నారు.

పైన వ్రాసిన పైత్యాలు ఎన్నివున్నా, తెలుగునాట తెలుగుకి భవిష్యత్తు లేక పోవటమేమిటి? ఏప్రాంతానికి వెళ్ళినా చక్కటి తెలుగులో మాట్లాడే కోట్లాది ప్రజలు, మళ్ళీ పుంజుకుంటున్న అష్టావధానం, హరికథలలాటి సాంస్కృతిక కార్యక్రమాలు, కొన్ని మంచి సాహిత్య తెలుగు పత్రికలు తెలుగును ముందుకు నడిపిస్తూవున్నాయి.

ఇక ప్రవాసాంధ్రుల్లో తెలుగు సంగతి చూద్దాం. కనీసం మొదటితరం ప్రవాసాంధ్రుల్లో తెలుగుకి దూరమయిపోతున్నామనే దిగులు కనిపిస్తుంది నాకు. బహుశా దానివల్లే కాబోలు, పిల్లలతో పెద్దవాళ్ళు తెలుగులోనే మాట్లాడటం, కొన్నిచోట్ల తెలుగు స్కూళ్ళు, తెలుగు పత్రికలు నడపటం ఎక్కువగా కనిపిస్తుంది. అమెరికాలో యూనివర్సిటీ ఆఫ్ టెక్సాస్‌లాటి చోట్ల డిగ్రీ లెవెల్లో తెలుగు నేర్పుతుంటే, విస్కాన్సిన్ యూనివర్సిటీలో తెలుగు పి.హెచ్.డి. వుంది. మాకు తెలుగురాదు. ఇంగ్లీష్‌లోనే మాట్లాడతామనే తెలుగువాళ్ళు అమెరికాలోనూ వున్నారు. పిల్లలకి తెలుగు నేర్పవలసిన అవసరం లేదని, వాళ్ళ పిల్లల తెలుగు భవిష్యత్తు నిర్ణయించే తల్లిదండ్రులూ వున్నారు. "మా పిల్లలకి తెలుగు నేర్చుకునే అవకాశాల్ని వాతావరణాన్ని తప్పకుండా ఇస్తాం. ఎంతవరకూ నేర్చుకుంటారో, అది వాళ్ళ ఇష్టం" అని ఆ నిర్ణయాన్ని

పిల్లలనే వదిలేసే పెద్దలూ వున్నారు.

అమెరికాలో ఓ పెద్ద సిటీలో నన్నొక సాహిత్య సభలో మాట్లాడమన్నప్పుడు. నేను నా అమెరికా బేతాళుడి కథల గురించి మాట్లాడాక పదిహేనేళ్ళ అమ్మాయి వచ్చి నా కథలన్నీ చదివానంది. ఆ అమ్మాయి అమెరికాలోనే పుట్టి, అమెరికాలోనే పెరిగి, అక్కడే వాళ్ళ అమ్మగారి దగ్గర తెలుగు మాట్లాడటం, చదవటం నేర్చుకున్న అమ్మాయి. అప్పుడు నాకు వేసిన ఆశ్చర్యాన్ని మించిపోయింది, అమెరికాలో తెలుగు భాషకు భవిష్యత్తు వుందనే కొండంత ఆశ.

అలాగే, ఓ తెలుగు కార్యక్రమంలో ఇంగ్లీషులో "అవర్ నెక్స్ట్ ప్రోగ్రాం ఈజ్ ఎ టెల్గూ సాంగ్ బై సంగీటా" అని చెప్పిన తర్వాత, అమెరికాలోనే పుట్టి పెరిగిన ఆరేళ్ళ సంగీత వచ్చి, మా తెలుగుతల్లికీ మల్లె పూదండ అని స్వచ్ఛమైన తెలుగులో ఆ పాటని శ్రావ్యంగా పాడుతుంటే మళ్ళీ అదే కొండన్నర ఆశ.

కొంతమంది రెండవతరం తెలుగు పిల్లలు, మాకు తెలుగు బాగా అర్థమవుతుంది. కానీ చదవటం అంతగా రాదు. తెలుగులో ఆడియో పుస్తకాలు ఎందుకు రావటం లేదూ? అవయితే మంచి పుస్తకాలను చదవలేకపోయినా వినగలంకదా. మీ పుస్తకాలను ఆడియో పుస్తకాలుగా ఇవ్వకూడదూ అన్నారు నాతో. ఇక్కడి వారిలో నాకు మళ్ళీ అదే ఆశ కనపడింది. వాళ్ళకి తెలిసిన పద్ధతిలో తెలుగుకి దగ్గరవుదామనే ఉత్సాహం కనపడింది. ఇక పెద్దలుగా మనం చేయవలసిన పని, ఇలాంటి పిల్లలకు తెలుగు నేర్చుకోవటానికి కావలసినవి సమకూర్చటం. ఇంగ్లీష్ మీడియం ద్వారా తెలుగు నేర్పటం, చక్కటి సాహిత్యాన్ని, వేమన సుమతి శతకాలనూ ఆడియో పుస్తకాలుగా తయారుచేయటంలాంటివి. అమెరికాలోని రెండు తెలుగు అసోషియేషన్లు, తానా ఆటాలు, రాజకీయనాయకుల మీదా, సినిమా నటుల మీదా తప్ప, తెలుగు భాష గురించీ, రెండవతరానికి తెలుగు నేర్చుకోటానికి కావలసినవి సమకూర్చటం గురించీ మాట్లాడటం లేదు. అలాగే తెలుగులో మంచి నవలలను సినిమాలుగా తీయటమనేది పూర్వపు రోజుల్లోనే. ఈ రోజుల్లో అలాంటివి తీసే ఉత్సాహం, శక్తి సామర్థ్యాలు వున్నవాళ్ళు తెలుగు సినిమారంగంలో చాల కొద్దిమంది. కుటుంబ చిత్రాల దర్శకులు బాపు. విశ్వనాథ్, కృష్ణారెడ్డిలాంటి వారున్నా చక్కటి నవలాచిత్రాలు తీయటానికి వారిని సమర్థించే నిర్మాతలూ, పెట్టుబడీ తెలుగుదేశం బయటనించీ మాత్రమే రావాలి కానీ, మన బూతు/పగ/సెక్స్/వయలెన్స్ చిత్రాల నిర్మాతా దర్శకులనించీ వస్తుందని అనుకోను.

తెలుగు భాషకి భవిష్యత్తు ఆంధ్రదేశంలోనే కాదు తెలుగువాళ్ళు వున్న అన్ని చోట్లా అన్నిప్రదేశాల్లోనూ అన్ని దేశాల్లోనూ వుంది. వుంటుంది. అది మనం నిర్ణయించేదీ కాదు. నిర్దేశించేదీ కాదు. కాకపోతే, భాషాభివృద్ధికి మనం చేయవలసినది చేసే బాధ్యత, కర్తవ్యం మన మీద వున్నాయి.

ముందుకు పోతున్న చక్రాల బండిని తోయటానికి మనం కూడా ఒక చెయ్యి వేస్తే, అది అలా వెడుతూనే వుంటుంది. ఎక్కేవాళ్ళు ఎక్కుతారు. లేనివాళ్ళు లేదు.

*       *       *